# మనసు - మనిషి!

అక్కడికి అర్ధరాత్రివేళ ఎవరూ రారు! (అక్కడికని ఏమిటి,ఎక్కడికైనా అర్ధరాత్రివేళ నిశాచరుల్లా నడచివెళ్ళేదెవరు?!)

గుంటూరువైపు వెళ్ళేవిగానీ, గుంటూరునుంచీ వచ్చేవి గానీ, వాహనాలేమీ లేనట్లుంది. కృష్ణా బరాజ్ నిశీథిలో నిశ్శబ్దం పాటిస్తోంది. పైగా ఒళ్ళంతా ట్యూబులైట్ల కళ్ళతో చీకట్లో దాక్కున్న రైల్వే వంతెనలకేసి చూస్తోంది. ఏటిగాలి శ్మశానాలకేసి వీస్తోంది. ఏ చితిమీద రవ్వలు ఎగజిమ్మాలనో మరి! కానీ అక్కడా చితులేవీ మండుతున్నట్లు లేదు. అలల సంగీతాన్ని దూరానికి మోసుకు వెళ్ళాలని విఫలయత్నం చేస్తోంది గాలి.

అలాంటి గంభీర వాతావరణంలో ఆదరా బాదరా నడిచి వస్తోందొక స్త్రీమూర్తి. ఆమెకు అభిముఖంగా సన్నటి కర్ర ఆధారంతో కుంటుతూ ఎవరో కుంటివాడు వస్తున్నాడు.

ఆమె హఠాత్తుగా ఆగిపోయింది...భయంవల్లనేమో! వాడు ఇంకా దగ్గరకి వచ్చేస్తున్నాడు. ఏకబిగువున నడవలేక కాబోలు మధ్య మధ్య ఊపిరి తీసుకుని మళ్ళీ నడుస్తున్నాడు. ఆమెను చూసి వాడూ ఆగిపోయాడు. ఓ క్షణం తటపటాయించి మళ్ళీ ఏమనుకున్నాడో ఆమెకు సమీపానికి వచ్చి, దీనంగా చూసి "అమ్మా... ధర్మం" అంటూ చెయ్యి చాపాడు.

వట్టి ఎముకల పోగులా, ఆకలికి సగం చచ్చినవాడిలా ఉన్న వాడి అర్థింపు విని ఆమెకు నవ్వొచ్చింది! నవ్వు దాచుకుని ఓమాటు నఖశిఖ పర్యంతం వాణ్ని పరిశీలించింది.

ఒకసారి తనచుట్టూ చూసింది.

పట్టపగల్లా వెలుగునిస్తున్నాయి లైట్లు.

పట్టపగ్గాలు లేనట్లు గాలి వీస్తోంది.

ఎదురుగా ముష్టివాడు ఏదో సామెత చెప్పినట్లు 'పొద్దెరక్కుండా బిచ్చం అదుగుతున్నాడు వీడు? వీళ్ళకి మనిషి అగుపించగానే చెయ్యి చాపడం అలవాటైపోయింది. కాబోలు' అనుకుంది.

"అమ్మా ధర్మం..." నూతిలోంచి మాట్లాడినట్లు అడిగాడు కుంటివాడు.

ఆమెకు చటుక్కున కోపం వచ్చింది."ఏయ్... నీకేమన్నా పిచ్చెక్కిందా? అర్ధరాత్రిపూట అడుక్కోవటమేంటి?"అడుక్కొనే వేళలు తానే నిర్ణయించిపెట్టినట్లు, రోడ్డుమీద లైటులేకుండా వెడుతున్న సైకిల్‌వాణ్ని పోలీసు గద్దించినట్టు గద్దించింది.

వాడు చిన్నగా దగ్గుతో కలిసిన నవ్వు నవ్వాడు.

"అర్ధరేతిరి అడుక్కుంటే పిచ్చన్నారు. అర్ధరేతిరి ఆడకూతురు ఈడకి రావడం ఏంటమ్మా?" వ్యంగ్యంగా అడిగాడు.

"అదంతా నీకు దేనికి? నీ దారి నీవు చూసుకో" రోషంగా అన్నదామె. కుంటివాడు కఱ్ఱమీద భుజం ఆన్చి ఆమె మొహంకేసి చూశాడు. తదేకంగా చూశాడు.

"అమ్మా, ఎందుకు చచ్చిపోవాలనుకుంటున్నావ్" అన్నాడు తాపీగా.

ఆమె తుళ్ళిపడింది. పట్టుబడిన దొంగలా తత్తర బిత్తరపడింది.

కుంటివాడు ప్రశ్నిస్తున్నాడు. "పరీక్ష తప్పావా? ఏ బాబన్నా మోసం చేశాడా? ఇంట్లో మారుతల్లి బాధలు పెడుతోందా?" మెత్తగా అచ్చం రోగిని ప్రశ్నిస్తున్న డాక్టరులా అడిగాడు.

ఆమె పిట్టగోడ మీదికి మొహం వాల్చి, అంత బింకమూ, అంత రోషమూ మరిచిపోయి గొల్లున ఏడ్చింది.

"ఏడవబోకమ్మా... ఏడవబోకు" అన్నాడు ఆమె బాధ గ్రహించినట్లు, రుద్ధకంఠంతో సానుభూతితో.

ఆమె మరో నిమిషందాకా ఏడుస్తూనే ఉండిపోయింది. వెంటనే వెనుదిరిగి మెళ్ళోంచి సన్న గొలుసు తీసి "ఇదిగో...ఇందాక ధర్మం చెయ్యమన్నావ్‌గా? ఇదిగో... ఈ బంగారు గాజులుకూడా తీసుకో. చచ్చిపోయేముందు చెవులకి మాత్రం దేనికి? ఈ బంగారు రింగులు ఈ ఉంగరం... ఇంకా ఇంకేమీ లేవు ఫో! ఎవరికీ చెప్పబోకు. ఏమీ చూడలేదనుకొని వాటితో హాయిగా బ్రతుకు" ఆమె గోడమీద నుంచి గెంతబోయింది.

కుంటివాడు గాబరాగా ఆమెను పట్టుకుని "ఆగు,తల్లీ ఆగు! నా మాట కాస్త విను... నేనూ చావటానికే వచ్చాను" అన్నాడు.

ఆమె ఆశ్చర్యంగా అతణ్ని చూసింది. ఆమెకు తెలియకుండానే ప్రశ్నించింది. "అదేం!అడుక్కునేదాంట్లో ఆకలి తీరటంలేదా? ఎవరిముందు చెయ్యి చాచినా చీదరించుకుంటున్నారా? అవిటితనంతో జీవితం దుర్భరంగా ఉందా?" జాలిగా అడిగింది.

కుంటివాడు కళ్ళు తుడుచుకున్నాడు. "ముందు నువ్వెందుకు వచ్చావో చెప్పు?" అన్నాడు.

"నేను... నేను" మాటలు వెతుక్కుని, నువ్వే చెప్పేశావుగా?! మోసపోయాను... పాపంతో బ్రతకలేక" అంది.

కుంటివాడు పకపక నవ్వాడు.

"మోసపోయిన అమాయకత్వానికి, ఆ పాపానికి నువ్వు చావటానికి వచ్చావ్, నిన్ను మోసం చేసిన పాపానికి వాడు నిశ్చింతగా బతుకుతున్నాడు. ఇంకా చాలామందిని మోసం చేస్తాడు. వాడికి పాపం' అంటే లేని భయం నీకు దేనికి?"

ఆమె నవ్వింది. "నేను 'వాడు' కాదు కాబట్టి!"

కుంటివాడు అర్థం అయినట్లు తలూపాడు.

"ఆడదాన్ని గాబట్టి అన్యాయంగా చస్తానంటావ్?"

"మొగాడివిగా మరి నువ్వెందుకొచ్చావ్?"

"అవిటివాడు ఆడదానికంటే హీనం కాబట్టి!"

"నీకు కాలెందుకు లేదు? దేనికిందన్నా పడ్డావా?"

"అవును...యములాళ్ళ చేతులకింద పడ్డాను?"

"అదేంటి?" ఆశ్చర్యంగా అడిగింది.

"నేనసలు అవిటివాణ్ని కాదు, బలవంతంగా అవిటివాణ్ని చేశారు" బాధగా అన్నాడు.

"ఎవరు, ఎందుకు?" ఆమె ఉద్వేగంతో ప్రశ్నించింది.

కుంటివాడి గొంతు జీరబోయింది. గతంలోకి చూసి చెబుతున్నట్లు చెప్పాడు.

"అప్పుడు పదేళ్ళు నాకు. అమ్మ కులట! అయ్య లారీలమీద పని చేస్తుండేవాడు. ఓమాటు ఆ లారీ కింద పడి చచ్చాడు. అయ్యె చచ్చినాక నాకు చదువు మానిపించి పనిలో పెట్టింది. కానీ, ఆ వయసులో నాకు పనిమీద మనసుండేది కాదు. సావాసగాళ్ళతో బడికి పోయిరావడం అలవాటయిన నాకు బాధనిపించేది. చదువు మానినా సావాసగాళ్ళతో తిరగడం మానలేదు. అమ్మ నన్ను గట్టిగా దండిస్తుండేది. ఒంటిమీద వాతలు పెట్టేది. అరికాళ్ళలో కూడా పెట్టింది! నేను మారలేదు. ఇక లాభం లేదనుకొని రంకు మొగుడిచేత కాలు కీలు ఇరగ్గొట్టించింది. అప్పటినుంచి ఇల్లు ఇడిచేశాను. ఇట్టా అడుక్కుంటూ బతికాను..."

"ఇంకా బతకొచ్చుగా?'

"ఎన్నాళ్ళు బతికినా చివరికి చావడమేగా?"

ఏదో జ్ఞాపకం వచ్చినట్లు, "అది సరే! చచ్చే ఉద్దేశంతో వచ్చి నన్ను చూడగానే చెయ్యి చాపావెందుకు?" అడిగింది.

కుంటివాడు నవ్వాడు."నేను చావటానికి వచ్చినట్లు నీకు తెలవకూడదని! అర్ధరేతిరి కూడా శనిలాగా దాపురించాడనుకొని దూరంగా వెళ్ళిపోతావని! కాని నిదానించి చూస్తే నువ్వూ అందుకే వచ్చావని తెలిసింది...!"

ఆమెకు నవ్వాగలేదు, "ఇద్దరమూ తోడుదొంగలన్నమాట?"

000

అన్ని బంధాలూ తెంచుకొని ఇహలోకం విడిచిపెట్టదానికి నిశ్చయించుకొన్నవారికి ఇక ఆభరణాలు మాత్రం ఎందుకు?

పాపపుణ్యాల ప్రసక్తి అంతకన్నా లేదు. మానవత్వం సైతం కొనఊపిరి విడిచే అవస్థ అది. ఆ సమయంలో,అదే స్థితిలో ఉన్న మరొక అభాగ్య మానవుడు తారసిల్లితే

ఏమవుతుంది?

◆◆◆

వాడూ నవ్వాడు

"ఇంకెందుకు ఆలస్యం? దూకుదాం పట్టు. ఆలస్యం చేస్తే ఈ ధైర్యంకూడా ఉండదు! కఱ్ఱ అవతల పారెయ్యి. గోడ ఎక్కడానికి నేను సాయం చేస్తాను.'

కుంటాడు గోడకి తాపీగా ఆనుకుని. "నాకు చావాలనిపించడంలేదు" అన్నాడు.

ఆమెకి ఆశ్చర్యంతోపాటు ఆగ్రహం పెల్లుబికింది.

"మళ్ళీ మడతపేచీ పెడతావేమిటి?" అంది కోపంగా చూస్తూ.

"ఇన్ని నగలు దక్కాక నేనెందుకు చావాలి? ఏదన్నా యాపారం చేసుకు బతుకుతాను..." జేబులోంచి సగం తాగిన బీడీ తీసి అంటించుకున్నాడు.

ఆమె ఉక్రోషం పట్టలేకపోయింది.

"దొంగవెధవా! అదా నీ ఎత్తు? ఏదీ ఆ నగలిలా ఇచ్చెయ్యి" అని గద్దించింది.

"ఇవ్వను. ఎందుకివ్వాలి?'

"ఎందుకివ్వాలా? ఎవరి బాబు సొమ్మనుకున్నావ్‌రా? నీమీద పోలీసు రిపోర్ట్ ఇస్తాను, నిన్ను జైల్లో వేయిస్తాను" వెఱ్ఱికేకలు వేసింది.

కుంటాడు చలించలేదు.

"చచ్చేదానికి నీకీ వగలెందుకు? నేనడగకుండా నువ్వే ఇచ్చావ్ గానీ, నేను మీదపడి లాక్కోలేదు గద? ఇచ్చి మళ్ళీ తీసుకోటం బాగుందా?"

"మరి నాతోపాటు చస్తానని చావననటం బాగుందా?" రెట్టించింది.

"నేను చస్తాననలేదు, చావటానికి వచ్చానన్నాను. అంతే!"

"అయితే చావవేం?"

"నువ్వు చావవేం?"

"ముందు నువ్వు..."

"కాదు నువ్వే"

"నేను బతికినా పర్వాలేదు. నన్నే పాపమూ బాధించదు..." కుంటాడు ధీమాగా అన్నాడు.

"నన్నూ బాధించదు" మొండిగా అంది.

"బాధిస్తుంది. పాపమే కాదు, లోకం కూడా నిన్ను వదల్దు. నిన్ను కులట అని పిలుస్తుంది. నిన్నెవ్వరూ పెళ్ళి చేసుకోరు..."

"నీ బ్రతుకేం బాగుంటుందిలే! నీకు ఎవ్వరూ పైసాకూడా వెయ్యరు. ఆకలితో పేగులు మలమల మాడి చస్తావ్"

ఇద్దరూ బద్ధశత్రువుల్లా ఒకరినొకరు చూసుకొన్నారు.

అంతలో ఏదో చిన్న కారు గుంటూరువైపుగా వెడుతూ వీళ్ళమీదకి కాంతి ప్రసరించింది.

ఇద్దరూ మూగవాళ్ళయిపోయారు! ఎవరికి వాళ్ళకే భయం, వణుకు. గుండెల్లో దడ. వాళ్ళు భయపడినట్లే ఆ కారు వాళ్ళదగ్గర ఆగింది. అందులోంచి దిగిన పోలీసు ఇన్‌స్పెక్టర్ని చూసేసరికి ఇద్దరి కాళ్ళూ చల్లబడ్డాయి.

"ఏయ్... ఎవరు మీరు? ఏం చేస్తున్నారిక్కడ?" గద్దించాడు.

ఆమె బిక్క చచ్చి నిలుచుంది.

కుంటాడు నోరు తెరిచాడు.

"ఎవరో ఈవిణ్ని ఇందులోకి తొయ్యబోతుంటే అడ్డంపడ్డానండీ! ఆళ్ళు మీ కారు రావటం చూసి లారీమీద అదే లగువు తీశారండీ. వద్దన్నకొద్దీ ఈ నగలన్నీ మాకిచ్చి, నా పేణం నిలబెట్టావ్.. ఈటిని తీసుకో" అంటుంటే ఇంతలో మీరొచ్చారు బాబూ" అంటూ చేతిలో నగలు ఇన్‌స్పెక్టర్‌కిచ్చాడు.

మొదట కాస్త సందేహించినా, ఆ కథ నమ్మినట్లే ఉంది.

"ఎక్కడికి వెళుతున్నారమ్మా"? అన్నాడు.

"గుంటూరు" అందామె వెంటనే.

"ఇంత అర్ధరాత్రా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"తప్పలేదు. అవతల మా అక్కకి ప్రాణంమీదకొచ్చినట్లు టెలిగ్రామ్ వస్తే ఆదరా బాదరా బస్‌స్టాండ్‌కొచ్చాను. లాస్ట్ బస్ వెళ్ళిపోయింది. గుంటూరువైపు వెళ్ళేవి ఏమన్నా దొరుకుతాయా అని చూస్తే, లారీ ఒకటి దొరికింది. అదే చాలనుకొని ఎక్కితే, మధ్యలో నా దగ్గరున్న సూట్ కేసు, అయిదొందలూ లాక్కుని ఇందులోకి తొయ్యబోతుండగా దేవుడిలా ఈ బిచ్చగాడు అడ్డం పడ్డాడు. మిగతాది మీరు విన్నారు..." తడుముకోకుండా సమాధానం పలికింది.

"అలాగా? సరే... కేసు గురించి తరవాత వివరంగా చెబుదురుగానీ, ముందర కారెక్కండి. అవతల ఎవరికో సీరియస్ అంటున్నారు" అంటూ త్వరబెట్టాడు ఇన్‌స్పెక్టర్.

ఆమె కార్లోకి ఎక్కబోతూ, కుంటాడికేసి కృతజ్ఞతగా చూసి చేతులు జోడించింది. వాడు కూడా చేతులు జోడించాడు.

కారు కనుమరుగయింది. మరికాస్సేపటికి బరాజ్ రోడ్డు మీద, నిర్మానుష్యంగా ఉన్న ఆ వేళలో కుంటాడి కర్ర చప్పుడు ఒక్కటే మిగిలింది!

కృష్ణానది గట్టిగా మూలిగింది!

(ఆంధ్రప్రభ వారపత్రిక)